క్లుప్తంగా

మద్యం దుకాణాల పరిశీలన


బలిజిపేటలో మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి

బలిజిపేట: మండలంలోని మద్యం దుకాణాలను సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల్లోని రికార్డులు, స్టాకును ఆమె పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, బెల్టుషాపులను ప్రోత్సహించరాదని సూచించారు. షాపుల్లో ఎక్కడా ఎటువంటి తేడాలు లేవన్నారు. ఎక్కడైనా తేడాలు ఉంటే షాపు యజమానులపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ


మిర్తివలస అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పీడీ కనకదుర్గ

బలిజిపేట: బాల్య వివాహాలను నిరోధించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కనకదుర్గ తెలిపారు. కిశోరీ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె మిర్తివలస కేంద్రాన్ని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అదేవిధంగా లింగ వివక్ష చూపరాదని హితవు పలికారు. బాలికల అపహరణ, అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆహారలోపం, అనారోగ్యం, బాల్య వివాహాలు, లైంగికవేధింపులు, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టడంలో అందరి పాత్ర ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బలిజిపేట సీడీపీఓ సులేఖ, సూపర్‌వైజర్ పద్మావతి, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయరహదారిలో గోతులు


ఇటుక బట్టీ సమీపంలో ప్రమాదకరంగా గొయ్యి

సీతానగరం: మండలకేంద్రానికి ఆమడదూరంలో నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడే జాతీయరహదారిపై ఏర్పడిన గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గోతులను పరిశీలించి కల్వర్టులకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.


ఆర్.వెంకంపేట జంక్షన్ వద్ద బీటీరోడ్డుపై ఏర్పడిన గొయ్యి

పాఠశాలను పట్టించుకోని కమిటీ చైర్మన్

భామిని: మండలంలోని బాలేరు ఎంపీపీ(ఆర్)స్కూల్‌లో ఈదురు గాలులకు పాఠశాల ప్రాంగణంలోని చెట్టుకూలింది. కానీ ఆ చెట్టును ఇంకా తొలగించలేదు. ఇదే స్కూల్‌కు ఇప్పటికే రూ.5400 విద్యుత్తు బిల్లు వచ్చింది. ఆరు నెలలుగా మోటార్ మరమ్మతుల బారిన పడి మూలకు చేరింది. స్కూల్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ విషయాలను స్కూల్ కమిటీ చైర్మన్ పట్టించుకోవడం లేదని..పాఠశాల హెచ్‌ఎం, కమిటీ కన్వీనర్ కమిటీ సభ్యులకు ఇదే విషయాన్ని తెలియజేశారు. కనీసం కమిటీ దగ్గర ఉన్న నిధులను ఖర్చు చేసేలా చూడాలని సభ్యులకు హెచ్‌ఎం లేఖ రాయడం విడ్డూరం. విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తగ్గిన దిగుబడి.. పెరిగిన ధర

అమాంతం పడిపోయిన మామిడి ఉత్పత్తి

- వాతావరణం అనుకూలించకపోవడమే కారణం
- పార్వతీపురం మన్యం జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం:4 వేల హెక్టార్లు
- గతేడాది పంట దిగుబడి: 39.5 వేల మెట్రిక్ టన్నులు
- ఈ ఏడాది దిగుబడి 9.5 మెట్రిక్ టన్నులు


వీరఘట్టం మార్కెట్‌లో లభ్యమవుతున్న బంగినపల్లి మామిడికాయలు


అరకొరగా పండిన దేశవాళీ మామిడి

వీరఘట్టం:

మామిడి రైతులకు దిగులు తప్పడం లేదు. ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గడంతో పాటు అకాల వర్షాలు, ఈదురుగాలులు మరింత నష్టాల ఊబిలోకి నెట్టాయి.కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ దిగుబడి కంటే ఈ ఏడాది 75 శాతం దిగుబడులు తగ్గాయి. దీంతో జిల్లాలోని 4 వేల హెక్టార్లలో మామిడితోటలు సాగు చేస్తున్న 2,500 మంది రైతులు డీలా పడ్డారు.రూ.కోట్ల పెట్టుబడి పెట్టి కౌలుకు తీసుకున్న మామిడి తోటల్లో పూతలేక కాపుకాయక దిగుబడులు పడిపోవడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గిపోవడంతో మామిడి రైతులు రూ.కోట్లలో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఏటా వేల టన్నుల మామిడి పంట ఎగుమతి చేసేవారు. ఈసారి పంట తగ్గడంతో ప్రజలు మామిడి పండ్లు కొని తిందామన్నా దొరకని పరిస్థితి ఏర్పడింది.పంట దిగుబడి పడిపోవడంతో ధర అమాంతం నాలుగు రెట్లు పెరగడంతో మామిడి రైతులకు కొంత ఊరట లభించింది.


వచ్చిన అరకొర బంగినపల్లిని ఎగుమతికి సిద్ధం చేస్తున్న రైతులు

ఇదీ పరిస్థితి..

ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో వీచే చలిగాలులకు మామిడిపూత వస్తుంది. అయితే గతేడాది అక్టోబర్‌లో అకాల వర్షాలు పడడంతో పాటు చలితీవ్రత తగ్గింది. వాస్తవానికి నవంబర్, డిసెంబర్ నెలల్లో పగటి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల నుంచి 17 డిగ్రీలు ఉండాలి.అయితే వర్షాల ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆ రెండు నెలల్లో ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల నుంచి 30 డిగ్రీలు నమోదయ్యాయి. అంతేకాకుండా తెల్లవారుజామున కురిసిన తేనె మంచు తదితర కారణాల వల్ల మామిడిపూత తొలిదశలోనే రాలిపోయింది. దీంతో పంట దిగుబడులు కొంత తగ్గాయి. అలాగే మార్చి, ఏప్రిల్ నెలల్లో వచ్చిన ఈదురుగాలులు మామిడి పంటపై ప్రభావం చూపాయి. చివరిదశలో కోతకు వచ్చిన పంట పైన కూడా మే నెలలో వీచిన ఈదురుగాలులతో చాలా వరకు కాయలు రాలిపోయి రైతులు నష్టాలు చవిచూశారు.

ఇదీ విషయం..

వాస్తవానికి ఒకప్పుడు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో అనుసంధానంగా ఉన్న పార్వతీపురం మన్యంజిల్లాలో 20 ఏళ్ల క్రితం ఉద్యానవన శాఖ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందే దశాబ్దాల కాలం నుంచి ఉద్యానవన పంటలు సాగులో ఉన్నాయి. వాటిలో సీజనల్ పంట అయిన మామిడి తోటలు జిల్లాలో విస్తృతంగా ఉన్నాయి. గతంలో 3,500 హెక్టార్లలో మామిడి తోటలు ఉండేవి. గత 20 ఏళ్లుగా ఉద్యానవనశాఖ జిల్లాలో మరో 500 హెక్టార్లలో మామిడితోటల పెంపకానికి తోడ్పాటు అందించడంతో ప్రస్తుతం జిల్లాలో 4 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 25 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న మామిడి తోటలు 90 శాతం వరకు ఉన్నాయి. వర్షాల ప్రభావంతో వాటికి పూత రాక దిగుబడులు తగ్గినట్లు ఉద్యానవన శాఖ చెబుతోంది.

తగ్గిన దిగుబడి..

జిల్లాలో సాధారణంగా బంగినపల్లి, సువర్ణరేఖ, కలెక్టర్, దేశవాళీ రకాలు మామిడి పంట సాగులో ఉన్నాయి. దేశవాళీ రకాలు పీచు ఎక్కువగా ఉండి జూన్, జూలై వరకు వాటి దిగుబడి ఉంటుంది. ఇతర రకాలు మాత్రం మే–జూన్ మధ్యలోనే దిగుబడి వచ్చేస్తుంది.అయితే ఈ ఏడాది మే నెలాఖరుకు సీజన్ పూర్తయ్యేలా ఉందని రైతులు అంటున్నారు. జిల్లాలో 4 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారు. ఏటా 39.5 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది.

స్థానిక మార్కెట్‌లో సిండికేట్ హవా..

ప్రస్తుతం బరంపురం మార్కెట్‌లో గ్రేడ్–1 రకం బంగినపల్లి కిలో రూ.40 ధర ఉంది.అయితే ఈ ధరకు ఎగుమతి చేసేందుకు తగినంత మామిడి దిగుమతులు లేవని రైతులంటున్నారు. ఉన్న అరకొర పంటను వ్యాపారులు స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే విక్రయిస్తూ సిండికేట్ అవుతున్నారు. ప్రస్తుతం పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల్లో బంగినపల్లి కిలో రూ.60 నుంచి రూ.80లు ఉంది. అలాగే చెరుకు రసాలు, దేశవాళీ రకాలు రూ.90 పలుకుతున్నాయి. అయితే ఈ ధరకు గ్రేడ్ రకం కొనుగోలు చేద్దామన్నా పంట దిగుబడి లేకపోవడంతో ఉన్న మేరకు జిల్లా ప్రజలు మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్నారు.

వాతావరణ ప్రభావం

గతేడాది అక్టోబర్‌లో చలితీవ్రత తగ్గడం మామిడి పంటపై ప్రభావం పడింది. సీజన్‌లో సకాలంలో చలిగాలులు వీయకపోవడం, దీనికి తోడు పూత వచ్చిన సమయంలో తేనె మంచు కురవడం, అలాగే ఈదురుగాలులు వీయడం వంటి కారణాల వల్ల పూత రాక మామిడి దిగుబడులు తగ్గాయి. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే దిగుబడులు పెరుగుతాయి.

– టి.అమరేశ్వరి, ఉద్యానవనశాఖ అధికారి,పాలకొండ సర్కిల్

డీలా పడిన వ్యాపారం..

జిల్లాలో ఏటా రూ.80 కోట్ల మామిడి పండ్ల వ్యాపారం జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా జిల్లా నుంచి ఎక్కువగా ఒడిశాలోని బరంపురం, ఖుర్దా, భువనేశ్వర్ నగరాలకు, అలాగే పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాకు జిల్లా మామిడిని ఎగుమతి చేస్తుంటారు. అయితే ఈ ఏడాది దిగుబడులు తగ్గడంతో మామిడి ఎగుమతులు కూడా నిలిచిపోయి వ్యాపారాలు డీలా పడిపోయాయి.

వేతనదారులు విధిగా మస్తరు వేయించుకోవాలి


వేతనదారుల మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొనే వేతన దారులు విధిగా రెండుపూటలూ మస్తరు వేయించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కాశీపేట,అంటిపేట గ్రామాల చెరువుల్లో వేతనదారులు చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంటిపేట చెరువులో జరుగుతున్న పనులను తనిఖీ చేసిన అనంతరం వేతనదారుల మస్తరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీపేటలో చెరువులో పనులు చేపట్టడానికి అనుకూలంగా ఉందన్నారు. అలాగే అంటిపేటలో చెరువులో నీరు ఉన్న కారణంగా మట్టిని దూర ప్రాంతానికి తరలించాల్సి వస్తున్నందున పని వేగవంతం చేయాలని సూచించారు. టెక్నికల్ సహాయకులు జరుగుతున్న పనులను తరచూ పరిశీలించి పనికి తగిన వేతనాలు వచ్చేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

మండుటెండలో వేతనదారుల అవస్థలు


నర్సిపురంలో చెట్టుకింద ఉన్న గట్టుపై సేదతీరుతున్న ఉపాధి వేతనదారులు

పార్వతీపురం రూరల్:

ఉపాధిహామీ పనుల్లో భాగంగా వెళ్లిన వేతనదారులకు నిలువ నీడలేక మండుటెండలో చెట్టు నీడలో గట్టుపై కూర్చుని, మరి కొందరు గొడుగు కింద తలదాచుకుని మండుటెండలో పని ముగించిన అనంతరం సేదదీరేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేతనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


గొడుగు సంరక్షణలో మండుటెండలో సేదతీరుతున్న వేతన దారులు

సారా రహిత గ్రామాలే లక్ష్యం


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామ–మండలాలుగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దడమే లక్ష్యమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అధ్యక్షతన సారా నిర్మూలన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో సారా నిర్మూలన సాధ్యమని ప్రభుత్వం గుర్తించి మండలస్థాయి అధికారులతో కమిటీ వేసిందన్నారు. కమిటీల పర్యవేక్షణలో సారా రహిత గ్రామాలుగా తయారు చేయడానికి మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో మండల కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే సీతానగరం మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారులతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగిందన్నారు. గ్రామాల్లో సారా విక్రయించిన, సారా విక్రయాలను ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు కమిటీ ద్వారా తీసుకుంటామని తెలియజేశారు. సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

లేబర్‌కోడ్ రద్దు చేయాలి



బలిజిపేట: ర్యాలీ చేస్తున్న మహిళలు


సీతానగరం: మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి ఆర్ ఈశ్వరరావు

బలిజిపేట: లేబర్ కోడ్‌ను రద్దుచేయాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బలిజిపేటలో మహిళలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బలిజిపేటలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు దాలమ్మ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వస్తోందన్నారు. దీనివల్ల కార్మికులు కనీసం వారి సమస్యలపై నిరసన కూడా తెలియచేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలుకాక, ఉద్యోగ భద్రతలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలపై నిరసనలు తెలిపేందుకు పీకలు నొక్కుతున్నారని, వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురం రూరల్: దేశవ్యాప్తంగా కార్మిక ప్రదేశాలలో చేపట్టిన నిరసనల్లో భాగంగా మంగళవారం పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ నిరసనలో అసంఘటిత రంగ కార్మికులకు చట్టం చేసి లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ 2008లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ఇప్పటికీ రూ.లక్షా 17వేల కోట్లను సెస్ రూపంలో యజమానుల నుంచి నిర్మాణ సంస్థల నుంచి వసూలు చేశారని, ఆ డబ్బులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చుపెట్టకుండా సుమారు రూ.70కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. మన రాష్ట్రంలో కూడా సుమారు రూ.570 కోట్లను ఇతర అవసరాలకు కూటమి ప్రభుత్వం మళ్లించిందని విమర్శించారు. ఈ కారణంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చేయాల్సిన కృషి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికసంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనులు దొరకని సమయంలో ఇతర ప్రభుత్వ పనులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు శ్రీనివాసరావు, శంకరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురం రూరల్: భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ

పార్వతీపురంలో..

పార్వతీపురం: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు చేపడుతున్న నిరసనలో భాగంగా మంగళవారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు, బీవీ రమణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడవ సారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొస్తున్నారని, లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, బంగారు రాజేష్, గంట్రేటి గంగరాజు, బంగారు రవి పాల్గొన్నారు.


పార్వతీపరరం: మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఐక్యపోరాలతోనే ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

సీతానగరం: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడం ఐక్యపోరాటాలతోనే సాధ్యమని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా, కార్మిక సంఘాలతో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావడం ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే విధంగా చట్టాలు తీసుకురావడం అందుకనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేస్తోందని ఆరోపించారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్వాడీ వర్కర్స్ యూ నియన్, రైతుసంఘం గ్రీన్ అంబాసిడర్ల యూ నియన్ జిల్లా నాయకులు జి.జ్యోతి, బి.అప్పారావు, సీహెచ్ కృష్ణ, గౌరి, ఇతరసంఘాల కా ర్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరులో కరెంట్ కష్టాలు

- బెంబేలెత్తిన ప్రజలు


చినబజార్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు,ప్రజలు

సాలూరు: పట్టణంలో కరెంట్ కోతలతో పట్టణ వాసులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్యామలాంబ పండగ నేపథ్యంలో పట్టణ వాసులతో పాటు ఇళ్లకు వచ్చిన స్నేహితులు, భక్తుల కరెంట్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పండగ పనుల కోసమని నెలరోజుల ముందు నుంచి తరచూ కరెంట్‌కోతలు పెట్టారు. దీంతో నానా అవస్థలు పడ్డారు. పండుగ వేళ విద్యుత్‌కోతలు ఉండవని మంత్రి ఇచ్చిన హామీ అమలు కాని పరిస్థితి నెలకొంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, స్తంభాల పనులు పండగ ముందు చేపట్టారు. వాటి ఏర్పాటు వల్ల పండగలో విద్యుత్‌కోతలు ఉండవని మంత్రి తెలిపారు.అయితే పండగ మూడు రోజుల్లోనూ కరెంట్‌కోతలతో ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం.రోజులో కనీసం 12 గంటలు దాటి కరెంట్ లేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలువాపోతున్నారు.ఊరంతా రంగుల సీరియల్‌సెట్లు మిరిమిట్లు గొలుపుతుంటే ఇళ్లలో కరెంట్ లేక దోమలు,ఈగలు,ఉక్కపోతతో ప్రజలు నరకం చూశారు. వెలమపేట రామమందిరం, పెద్దవీధి వద్ద విద్యుత్ వైర్లు తెగిపోయాయి. స్థానికులు అప్రమత్తమై విద్యుత్ అధికారులకు తెలియచేయడంతో ప్రమాదం తప్పింది.గొర్లె వీది, కుమ్మరిపేట, గొట్టాపు వీధి, అల్లు వీధిల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు పాడయ్యాయి. విద్యుత్‌కోతలపై ఎలక్ట్రికల్ ఎ.డిని అల్లువీధి ప్రజలు నిలదీశారు.

మహిళల ధర్నా

విద్యుత్‌కోతలతో విసిగిపోయిన గొట్టాపువీధి మహిళలు చినబజార్‌జాతీయరహదారి మీదకు వచ్చి ధర్నా చేపట్టారు.మంగళవారం ఉదయం నుంచి కరెంట్ లేదని, మూడు రోజులుగా కరెంట్ సక్రమంగా ఉండడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐఅప్పలనాయుడు సంఘటనా స్థలానికి వచ్చి ధర్నా విరమింపజేశారు.


వాటర్‌ట్యాంకు ద్వారా నీటిని తెప్పించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గిరిరఘు


ఇండ్ల వద్ద ఏర్పాటుచేసుకున్న జనరేటర్‌లు

జనరేటర్‌లు, ఇన్‌వర్టర్లకు గిరాకీ

కరెంట్ కోతలను ముందుగానే గుర్తించిన పలువురు జనరేటర్‌లుఅద్దెకు తీసుకువచ్చి ఏర్పాటు చేసుకున్నారు.

పండగ వేళ నీటి కష్టాలు

కరెంట్ లేక మోటార్లు పనిచేయక ప్రజలు నీటికి ఇబ్బందులుపడ్డారు. దీంతో పలు ప్రాంతాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫోన్‌లు చేసి వాటర్‌ట్యాంకర్‌లైనా పంపించాలని కోరారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గిరిరఘు వాటర్‌ట్యాంకు తెప్పించి ప్రజలకు తాగునీటిని అందించారు.